క్లుప్తంగా

ఆస్పత్రిలో ఇద్దరి చేరిక



మెంటల్ కేర్ హాస్పిటల్‌లో చేర్పించిన వారితో ఏయూటీడీ ప్రతినిధి

సీతమ్మధార : మానసిక సమస్యలతో బాధపడుతున్న ఇద్దరిని గవర్నమెంట్ మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్పించినట్లు ఏయూటీడీ సంస్థ కేర్ టేకర్లు నందూరి శ్రీనివాస్, ప్రశాంత్ తెలిపారు. బొబ్బిలికి చెందిన సోమనాథ్ (49), కార్తిక్ పూర్తి వివరాలు ఏమీ చెప్పడం లేదని... వీరిద్దరూ ఎక్కడపడితే అక్కడ మలవిసర్జన చేస్తుండటంతో పరిస్థితి బాగాలేక వెంటనే ప్రభుత్వ మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్పించామని తెలిపారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా



డ్రా తీసి టోకెన్ ఇస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులో సోమవారం రైతుల స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం రైతులు వంద మంది, సాయంత్రం రైతులు 75 మంది దుకాణాలకు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి డ్రా తీసి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతీ వారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. రైతులు విధిగా వారికి కేటాయించిన స్టాళ్లలోనే విక్రయాలు జరపాలని సూచించారు. స్టాళ్లు ఉన్న రైతులు కూరగాయలు నేల మీద విక్రయించరాదని కోరారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సీతమ్మధార : సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, పేకాట, గుండాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ డి.వి.రమణ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు ఇటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొని ఆస్తులు పోగొట్టుకోవద్దని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకవేళ ఎవరికైనా ఇటువంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే డయల్ 112, విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ 79950957998, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

గాలి పటాల సందడి



నక్కవానిపాలెంలోని పాన్‌షాపు వద్ద గాలిపటాలు

సీతమ్మధార : సంక్రాంతి పండగ వస్తుందంటే చాలు పిల్లలు, పెద్దలు గాలి పటాలు ఎగురవేస్తుంటారు. రకరకాల గాలి పటాలను ఎగురవేస్తూ ఆనందంలో మునిగిపోతుంటారు. మంగళవారం సంక్రాంతి కావడంతో సీతమ్మధారలోని పలు స్టాల్స్‌లో పలు రకాల గాలిపటాలు విక్రయిస్తున్నారు. ఇప్పటికే పిల్లలు భవనాలపైకి ఎక్కి పతంగులు ఎగురవేస్తూ ఆనందిస్తున్నారు. సీతమ్మధార, నక్కవానిపాలెం, గాంధీనగర్, బాలయ్య శాస్త్రి లే అవుట్ తదితర ప్రాంతాల్లోని షాపుల్లో పలు రకాల గాలిపటాలు విక్రయిస్తున్నారు. డేగ, విమానం, పక్షులు, తదితర రకాల బొమ్మలతో కూడిన గాలిపటాలు విక్రయిస్తున్నారు. దీంతో పిల్లలు షాపుల వద్ద కొనుగోలు చేసి సందడి చేస్తున్నారు.

నేత్రపర్వంగా గోదారంగనాథుల కల్యాణం



వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



శ్రీలలితాపీఠంలో గోదా రంగనాథుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సీతంపేట : భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని వైష్ణవాలయాల్లో గోదాదేవి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారి కల్యాణంతో ధనుర్మాసం నెల రోజుల వ్రత మహోత్సవం ముగిసింది. అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో గోదా, రంగనాథుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గోదా దేవి, రంగనాథుల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, ఆభరణాలతో చూడముచ్చటగా అలంకరించారు. పండితుల వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పలువురు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. నెల రోజులు ధనుర్మాస వ్రత మహోత్సవంలో పాల్గొన్న భక్తులు కల్యాణం వీక్షించారు. కల్యాణంలోని ప్రతి ఘట్టాన్ని అర్చకులు కళ్లకు కట్టినట్టు చూపారు. అనంతరం భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

- స్థానిక శ్రీనివాసనగర్‌లో గల లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం గోదాదేవి, రంగనాథుల కల్యాణం ఘనంగా జరిపించారు. అర్చకులు నంబాళ్ వేంకట కూర్మాచార్యులు గోదా, రంగనాథుల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, ఆభరణాలతో చూడ ముచ్చటగా అలంకరించారు. అర్చకుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సుముహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు వేడుకగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు సతీసమేతంగా పాల్గొని కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు అందజేశారు.

వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో...

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా నిర్వహించే గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. తెల్లవారుజామున ఆలయంలో 4.30 గంటలకు వైభవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భోగి మంట వేసి గోదాదేవి అమ్మవారి విగ్రహంతో ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అమ్మవారి తరఫున శ్రీరంగనాథుడికి తిరుప్పావై సేవా కాలంలో భాగంగా 30వ పాశురం వినిపించారు. మహిళలు సంక్రాంతి ముగ్గులు వేశారు. గొబ్బెమ్మలు వేసి సంక్రాంతి లక్ష్మికి ఆహ్వానం పలికారు. సాయంత్రం ప్రత్యేక పూజలు అనంతరం గోదా రంగనాథుల ఉత్సవ విగ్రహాలను ఆలయం ఉత్తర ద్వారం సమీపంలో నిర్మించిన ప్రత్యేక వేదిక వద్దకు తోడ్కొని వచ్చి ఆసీనులను గావించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు శేషాచార్యులు ఆధ్వర్యంలో గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆనంద్‌స్వామి, ఇతర వేదపండితులు పాల్గొని స్వామి కల్యాణం దివ్యంగా జరిపించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. అనంతరం దాతలకు, భక్తులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో...



శ్రీలలితాపీఠంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు



త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్ శివారు గణేష్ నగర్‌లో గల త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో కొలువైన శ్రీ కోదండ రామ స్వామి దేవాలయంలో అర్చకులు ఏడిద గురునాథ్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం 'గోదా రంగ నాథ స్వామి' కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ అనంతరం కల్యాణం కనుల పండువగా జరిపించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి గంగా భవానీ దంపతులు ప్రవచనాలు చేశారు. అర్చకులు వేదాశీర్వచనంతో ఆ దంపతులను చైర్మన్, కమిటీ సభ్యులు సత్కరించి పట్టు వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు టి.ఎస్.ఎన్.మూర్తి, కార్యవర్గ సభ్యులు ఎం.ఎ స్.ప్రకాశరావు, ఎ.కృష్ణ, టి.వి.రావు, ఎం.సత్యనారాయణ, బి.ఆర్.నాయుడు, శంకర్ నాయుడు, టీవీ రమణ మూర్తి, వెంకట లక్ష్మి, మహాలక్ష్మి, ప్రభావతి, రమణమ్మ, ఈ.ఎస్.కుమార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా భోగి మంటలు



సీతంపేటలో వేసిన భోగి మంట



జనసేన కార్యాలయంలో భోగి వేడుకల్లో నాయకులు

సీతంపేట : తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే నాలుగు రోజుల సంక్రాంతి పండుగ భోగి మంటలతో సోమవారం సందడిగా ప్రారంభమైంది. అర్ధరాత్రి నుంచే యువత ఉత్సాహంగా వాడవాడలా భోగి మంటలు వేశారు. ఉత్తర నియోజకవర్గంలో వీధులన్నీ భోగి మంటలతో కళకళలాడాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా కుటుంబ సమేతంగా అంతా భోగిమంటల వద్ద చేరి ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. ఇంటిలో పనికిరాని వస్తువులను భోగి మంటల్లో వేస్తూ తమ కష్టాలు, చెడును భోగి మంటలకు ఆహుతి చేస్తూ, భోగభాగ్యాలను ప్రసాదించాలని వేడుకున్నారు. శాంతిపురం, మధురానగర్, రాజేంద్రనగర్, అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లోని అపార్టుమెంట్స్‌లో నివసిస్తున్న కుటుంబాలు అంతా కలిసి ఒకచోట భోగిమంటలు వేసికుని సందడి చేశారు. భోగి మంటలతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. సీతంపేటలో రాధాకృష్ణ ఆలయం వద్ద, దుర్గా గణపతి ఆలయం వద్ద యువకులు భారీ ఎత్తున భోగి మంటలు వేశారు. సాయంత్రం ముత్తైదువులు చిన్నారులకు భోగిపళ్లు పోశారు.

జనసేన నగర కార్యాలయంలో వేడుకలు

స్థానిక రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో భోగి వేడుకలు వైభవంగా నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని భోగి మంట వెలిగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెట గుళ్లు, గంగిరెద్దు విన్యాసాలు, హరిదాసు కీర్తనలు అలరించాయి. భోగి మంటల చుట్టూ మహిళలు, యువత హుషారుగా పాటలు పాడుతూ సందడి చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలకు వంశీకృష్ణ భోగి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అమరాపు దుర్గ, నాగలక్ష్మి, కిరణ్‌ప్రసాద్, శివప్రసాద్ రెడ్డి, నారా అమ్మాజీ, గుండు సురేష్‌బాబు, శ్రవణ్, శ్రీనివాస పట్నాయక్ పాల్గొన్నారు.

కంచరపాలెం : జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్‌లో గ్రామపెద్దలు, సీనియర్ సిటిజన్లు సంయుక్తంగా సోమవారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పండగలో మొదటి రోజు భోగి వేడుకలను నేషనల్ పోర్టు ట్రస్టు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు పాల్గొని భజన చెట్టును వెలిగించి సంబరాలు ప్రారంభించారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ సందడి చేశారు. సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గొర్లె చందు మాట్లాడుతూ కులాలకు అతీతంగా అందరినీ ఒకే చోట చేర్చే ఐక్యమత్యం పెంచడంలో భోగి పండగ కీలకమన్నారు. ప్రజలందరూ భోగభాగ్యాలతో, సుఖ సంతోషాలతో ఆనందంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో సాయిరామ్, నర్సింగరావు, సన్నిబాబు, రవి, కృష్ణ, శ్రీను, హేమంత్, రవీంద్ర, నాయుడు, శ్రీరాములు, చైతన్య, వినయ్ శ్రావ్య, ఉష, తదితరులు పాల్గొన్నారు.



భోగి వేడుకల్లో శాంతినగర్ ప్రజలు

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పేడాడ రమణికుమారి

మద్దిపాలెం : మాధవధార కళింగనగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సంక్రాంతి పండగ సందర్భంగా సోమవారం మాధవధార రామాలయం ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, పలువురు బీజేపీ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముగ్గుల పోటీలు, ఇతర పోటీల్లో పెద్ద ఎత్తున మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే సంక్రాంతి బహుమతులు కూడా అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నంబాల ఈశ్వరరావు, సభ్యులు శ్రీకాంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతుబజార్లు కిటకిట



వినియోగదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్లు

కంచరపాలెం : సంక్రాంతి వచ్చిందంటే చాలు పలు కుటుంబాల్లో సందడే సందడి. మకర సంక్రాంతిలో పితృ దేవతలకు మొక్కులు చెల్లించడమే ప్రధానం. నైవేద్యంగా స్వయంపాకాన్ని పురోహితునికి అందివ్వడం ఆనవాయితీ. సంక్రాంతి ఫలహారాలు, కూరలు పండగ రోజుల్లో ఇబ్బడిముబ్బడిగా ఇళ్లల్లో కనిపిస్తాయి. ఇళ్లన్నీ బంధువులతో కళకళలాడుతాయి. ఇందుకోసం పెద్ద ఎత్తున కాయగూరల అవసరాలు ఏర్పడుతాయి. ఈ నేపథ్యంలో పలు రైతుబజారుల్లో పెద్ద ఎత్తున కాయగూరలు విక్రయించారు. దేవ గుమ్మడి, చెరుకు గడలు, కూర పెండలం, చిలగడ దుంపలు, కూరగాయలు, ఆకు కూరలు పెద్ద సంఖ్యలో మార్కెట్‌కు తెచ్చారు. ఈ కాలంలో దొరికే ఇలాంటి కూరగాయలు కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఇష్టపడుతుంటారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతాలైన అరకు, కేడీ పేట, నర్సీపట్నం, సబ్బవరం, కొత్తవలస, దేవరాపల్లి, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన దుంపలు, చెరకు గడలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కంచరపాలెం రైతుబజారు సోమవారం వినియోగదారులతో కళకళలాడింది.



కంచరపాలెం రైతుబజారులో విక్రయిస్తున్న సంక్రాంతి సరకులు

కనులారా వైభవుడి నిజరూప దర్శనం



గోదాదేవి అమ్మవారి విగ్రహంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున గోదాదేవిని మేళతాళాల మధ్య ఆలయ ప్రదర్శిణ చేయించిన అనంతరం వైభవుడికి ఉదయాస్తమాన సేవలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు అనంతరం స్వామి నిజరూప దర్శనం భక్తులకు కల్పించారు. భోగి ఉత్సవాల్లో భాగంగా పొష్య లక్ష్మికి పూజలు చేశారు. సంక్రాంతికి సంబంధించిన అలంకరణలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అర్చకుడు శేషాచార్యులు భోగి మంటలు వెలిగించి భక్తులకు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

సంప్రదాయ పిండి వంటలకు తగ్గని క్రేజు



అప్పటికప్పుడు తయారుచేసి ఇస్తున్న బొబ్బట్లు



స్వీట్ షాపుల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పిండి వంటలు

సీతంపేట :

పల్లె విడిచి నగరం బాట పట్టినా... ఎంత ఆధునిక పోకడలు వంటబట్టినా సాంప్రదాయ పిండి వంటలపై మాత్రం మోజు తగ్గలేదనే చెప్పాలి. వస్త్రధారణ నుంచి మనం తినే తిండిలో సైతం పాశ్చాత్య పోకడ ప్రభావం ఎక్కువగా ఉన్నప్పటికీ తెలుగింటి సాంప్రదాయ పిండి వంటలపై మోజు మాత్రం ఇసుమంతైనా నగరవాసులకు తగ్గలేదు. బిర్యానీలు, పిజ్జాలు, బర్గర్లు, నూడుల్స్, పానీపూరీ, చాట్స్ వంటి ఫాస్ట్ ఫుడ్స్ ఎన్ని తిన్నా సంక్రాంతి పండగ వచ్చిందంటే పిండి వంటల్లో ఉన్న మజా రుచి చూడాల్సిందే. సెలవులు వస్తున్నాయంటే కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, మనవళ్లతో ఇళ్లంతా సందడిగా ఉండేది. వారి కోసం నాన్నమ్మలు, అమ్మమ్మలు అరిసెలు, బొబ్బట్లు, పాకుండలు, పూర్ణాలు, జంతికలు, చేగోడీలు, బెల్లం గవ్వలు, మురిపీలు, కజ్జికాయలు, పూతరేకులు, సున్నుండలు, గులాబి పూలు, పొంగడాల వంటి ఎన్నో రకాల పిండి వంటలు కట్టెల పొయ్యలపై సిద్ధం చేసి ఉంచేవారు. తరాలు మారాయి. ఇప్పుడు పిండి వంటలు తయారు చేసే నైపుణ్యం కొద్ది మందికే ఉంది. నైపుణ్యం, ఉన్నా చేసే తీరిక, ఓపిక లేకపోవడంతో రెడీమేడ్‌గా సిద్ధం చేసి విక్రయిస్తున్న స్వీట్‌షాపులపై ఆధారపడ్డారు. దీంతో పండగ రోజుల్లో జనాల అభిరుచికి తగినట్టు సాంప్రదాయ పిండి వంటలు తయారు చేసి స్వీట్ షాపుల్లో ప్రత్యేకంగా విక్రయిస్తున్నారు. నగరంలో చాలా చోట్ల హోమ్‌ఫుడ్స్ పేరిట స్వీట్ షాపుల్లో అప్పటికప్పుడు బొబ్బట్లు, అరిసెలు, పాకుండలు తయారు చేసి విక్రయిస్తున్నారు.

పావు కిలో, అర కిలో, కిలో చొప్పున ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. కిలో రూ.240 నుంచి రూ.380 ధరల్లో వివిధ రకాల సాంప్రదాయ పిండి వంటలు లభిస్తున్నాయి.

కట్టెల పొయ్యిపై పిండి వంటలు



సంక్రాంతి వస్తుందంటే అరిసెలు, పొంగడాలు, పాకుండలు, సున్నుండలు, జంతికలు, కజ్జికాయలు, పూర్ణాలు ఎన్నో రకాలు కట్టెల పొయ్యపై సిద్ధం చేసే వారం. కాలం మారింది. ఇప్పుడు పిండి వంటలు ఇంటిలో తయారు చేసే తీరిక, ఓపిక లేదు. స్వీట్ షాపుకు వెళ్లి నచ్చినవి కొని తెచ్చుకుంటున్నారు. జనాల అభిరుచికి తగినట్టు స్వీట్ షాపుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు.

– హెచ్.సరస్వతి, అక్కయ్యపాలెం

ఆధ్యాత్మిక జీవనంతో పరిపూర్ణత



పార్వతీ కుమార్ రాసిన పుస్తకాలు ఆవిష్కరిస్తున్న బీఎస్ఎన్ రాజు, కె.రమణీగోపాల్, బీఆర్‌కే రాజు

మహారాణిపేట: పరిపూర్ణత సాధించినప్పుడే మానవ జన్మ సార్థకమవుతుందని, దానిని సాధించడానికి మాస్టర్ పార్వతీకుమార్ రాసిన పుస్తకాలు ఉపకరిస్తాయని కోల్‌కత్తా ఇన్‌కమ్‌టాక్స్ కమిషనర్ బి.ఎస్.ఎస్.రాజు అన్నారు. జగద్గురుపీఠం ఆధ్వర్యంలో గురుపూజోత్సవాల ముగింపు సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీకుమార్ రచించిన 'అక్కల్ట్ మెడిటేషన్' అనే ఆంగ్ల వ్యాస్యాన్ని ఆయన ఆవిష్కరించి, ప్రసంగించారు. ధనిష్ఠ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.గురుప్రసాద్ అశ్విన్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. 'ఎక్వేరియన్ మాస్టర్' అనే పుస్తకాన్ని సర్కిల్ ఆఫ్ గుడ్ విల్ కార్యదర్శి బి.ఆర్.కె.రాజు, 'విష్ణు సహస్రనామం' వ్యాఖ్యానాన్ని కె.రమణి, మాస్టర్ సీవీవీ, ఎం.ఎన్.ఇ.కెలపై శ్రీపతి సనత్ కుమార్ సంకలనం చేసిన బాలల కథల చిత్రరూప పుస్తకాలను విడుదల చేశారు. సభలో కె.రమణి గోపాల్, బి.ఆర్.కె.రాజు, జగద్గురు పీఠం ఉపాధ్యక్షులు ఎస్.వి.ఎస్.మూర్తి, సీహెచ్ సత్యదేవ్, జి.వి.ఎస్.హరి పాల్గొన్నారు.

గురుపూజలో విదేశీ సాధకులు

జగద్గురు పీఠం ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న అంకోశా ఆడిటోరియంలో నిర్వహిస్తున్న 64వ గురుపూజ మహోత్సవాల్లో విదేశీ సాధకులు పాల్గొన్నారు. సుమారు 22 మంది విదేశీ సాధకులు గురు ప్రార్థన చేశారు. వీరు వేదిక మీద హిందూ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పాటించారు. అనేక పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో కె.గురుప్రసాద్, వారణాసి పార్వతి ,వి.వి.రామకృష్ణ శాస్త్రి, జి.వి.కృష్ణమోహన్, శ్రీపతి సనత్ కుమార్, యు.ఎస్.ఎస్.రాము ప్రసంగించారు. గొల్లపూడి రవికుమార్ బృందం ఉత్సాహంగా హనుమాన్ చాలీసా గానం చేశారు. అజ్జరపు శ్రీనివాస్, బి.ఆర్.కె.రాజు, ఎస్.శుభశ్రీ, పి.రవిశంకర్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ఘనంగా హోమం



శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

మహారాణిపేట: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం మాన్యు సూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ప్రతీ నెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం తెలిపారు. నరఘోష, శత్రు ఘోష, రుణ బాధ, గ్రహదోష శాంతి కోసం భక్తులు హోమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.